

పాపికొండలను తలపిస్తున్న 'కడెం'

కడెం ప్రాజెక్ట్ అందాలు బాగున్నాయని, పాపికొండలను తలపిస్తున్నాయని హైకోర్టు జడ్జి సృజన అన్నారు. కుటుంబసభ్యులతో కలిసి ప్రాజెక్టును సందర్శించారు. 8లో▸



కొలిక్కి వచ్చినట్లేనా.. 8లో▸

చెన్నూర్ ఎస్‌బీఐ-2 బ్రాంచ్‌లో జరిగిన కుంభకోణం కేసులో 90శాతం పురోగతి ఉంది. రెండ్రోజుల్లో పూర్తి స్థాయిలో ఆభరణాలు రికవరీ చేసే అవకాశమున్నట్లు సమాచారం.

వాతావరణం

గరిష్టం/కనిష్టం 31.0/24.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అల్పపీడన ప్రభావంతో పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో ప్రతిభ



విజేతలతో కోచ్ చేతన్

ఆదిలాబాద్: నిర్మల్ వేదికగా నిర్వహించిన రాష్ట్రస్థాయి యోగాసన పోటీల్లో జిల్లా కేంద్రానికి చెందిన క్రీడాకారులు సత్తా చాటారు. పట్టణంలోని బాలాజీ విద్యామందిర్‌కు చెందిన విద్యార్థులు పలు పతకాలు కైవసం చేసుకున్నారు. ఆర్టిస్ట్ ఫెయిర్ సబ్ జూనియర్ విభాగంలో ఆర్.హర్షవర్ధన్, ఏ. సాయిచరణ్, రిథమిక్ పెయిర్ విభాగంలో సీహెచ్.అభిజిత్, జైజగన్ ద్వితీయస్థానంలో నిలిచారు. అలాగే లెగ్ బ్యాలెన్సింగ్ విభాగంలో ఆర్. శశివర్ధన్ సైతం ద్వితీయ స్థానంతో సత్తా చాటినట్లు యోగా కోచ్ సీహెచ్. చేతన్ తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతలుగా నిలవడంపై పాఠశాల డైరెక్టర్ రంగినేని పవన్‌రావు, ప్రిన్సిపాల్ సచింద్రనాథ్ ప్రత్యేకంగా అభినందించారు.

నేటి నుంచి రాష్ట్రస్థాయి ఖేల్‌కూద్ పోటీలు



మాట్లాడుతున్న చక్రవర్తుల కృష్ణ ఆచార్య

ఆదిలాబాద్‌టౌన్: సరస్వతి విద్యాపీఠం ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ఖేల్‌కూద్ పోటీలు ఈనెల 8,9,10 తేదీల్లో నిర్వహించనున్నట్లు సరస్వతి విద్యాపీఠం తెలంగాణ ప్రాంత శైక్షనిక్ ప్రముఖ్ చక్రవర్తుల కృష్ణ ఆచార్య తెలిపారు. జిల్లా కేంద్రంలోని సరస్వతి శిశు మందిర్‌లో ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సంస్కృతికి నిలయాలుగా భావించే శిశు మందిరాల్లో చదువుతో పాటు విద్యార్థులకు బోధనేతర అంశాల్లో తర్ఫీదు ఇచ్చేందుకు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయి ఖేల్‌కూద్ పోటీల్లో భాగంగా పరుగుపందెం, హైజంప్, లాంగ్‌జంప్, జావెలిన్‌త్రోతో పాటు ఇతర పోటీలు ఉంటాయని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల నుంచి 450 మంది విద్యార్థులు పాల్గొననున్నట్లు చెప్పారు. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. పోటీలను ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో పాటు అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరై ప్రారంభిస్తారని వివరించారు.

లోకం ఉన్నంత కాలం కవిత్వం



నిర్మలరాణికి అవార్డు అందజేస్తున్న కవులు

ఆదిలాబాద్‌టౌన్: లోకం ఉన్నత కాలం కవిత్వం ఉంటుందని కవి బూర వెంకటేశ్వర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని జెడ్పీ సమావేశ మందిరంలో ఉదారి నాగదాసు స్మారక కవితా పురస్కార ప్రదాన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన తండ్రి పేరిట ఉదారి నారాయణ కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని అన్నారు. కరీంనగర్ జిల్లాకు చెందిన కవయిత్రి తోట నిర్మలరాణికి అవార్డు అందజేశారు. పలువురు కవులు కవిత్వాలను వినిపించారు. కార్యక్రమంలో సుమనస్పతి రెడ్డి, వసంత్‌రావు దేశ్‌పాండే, మన్నె ఏలియా, ఉదారి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కొట్టుకుపోయిన రోడ్డు



కోతకు గురైన రహదారి ఇదే..

సాత్నాల: మండలంలోని సుందరగిరి, ఖారా గ్రామాల మధ్య ఉన్న రోడ్డు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కోతకు గురైంది. ఖారా, వంజరిగూడ, గర్కా గూడా, సహజ్ తండా, దుబ్బగూడ, టెంగ్రి గూడా, తిప్పి, హత్తిగుట్ట గ్రామాలకు ఇదే ప్రధాన రహదారి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి త్వరితగతిన మరమ్మతు చేయించాలని కోరుతున్నారు.

మెడికల్ మాయాజాలం

- రెండు రోజుల క్రితం జిల్లా కేంద్రంలోని కలెక్టర్‌చౌక్ సమీపంలోని ఓ మెడికల్ షాపులో పట్టణానికి చెందిన ఓ వ్యక్తి థైరాయిడ్ మందులు కొనుగోలు చేశాడు. ఇంటికి చేరుకున్న తర్వాత చూడగా దానిపై 2025 జనవరి ఎక్స్‌పైరి డేట్‌గా గమనించాడు. విషయాన్ని షాపు నిర్వాహకుడితో చెప్పగా, తన చేతిలో ఉన్న మందులను లాక్కునేందుకు యత్నించాడు. ఈ విషయమై డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేయగా, ఆ షాపునకు నోటీసులు జారీ చేశారు.



కాలం చెల్లిన మెడిసిన్ ఇదే..

- ఇటీవల ఆదిలాబాద్ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిని కలెక్టర్ తనిఖీ చేసిన సమయంలో పలు నిబంధనలు పాటించలేదని తేలింది. అక్కడే ఉన్న మెడికల్ షాపును పరిశీలించగా, ఫార్మసిస్టు లేరు. మరో వ్యక్తితో మందులు విక్రయించడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్వాహకులకు రూ.20వేల జరిమానా విధించారు.
- రిమ్స్ ఆస్పత్రిలో మూడు ప్రైవేట్ మెడికల్ షాపులు నిర్వహిస్తున్నారు. అయితే ఫార్మసిస్టులు కాని వారితో మందులు విక్రయిస్తున్నారు. దీంతో పలువురు ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. జిల్లా బాస్ ఆదేశాల మేరకు డ్రగ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీలు చేసి సదరు షాపుల యజమానులకు నోటీసులు జారీ చేశారు.
- ఇటీవల ఆదిలాబాద్ బస్టాండ్ ఎదుట గల ఓ మెడికల్ షాపులో పనిచేసే వ్యక్తి డ్రగ్స్‌కు సంబంధించిన ఇంజెక్షన్లను దొంగతనం చేసి ఇతరులకు విక్రయించాడు. అయితే అతడికి ఫార్మసిస్టుగా సర్టిఫికెట్లు లేవు. విషయం బయటకు రావడంతో తనిఖీలు చేసిన అధికారులు సంబంధిత షాపు యజమానికి నోటీసులు జారీ చేసి వారం పాటు మూసి ఉంచారు.

- లైసెన్సు ఒకరిది.. నిర్వహణ మరొకరిది
- ధనార్జనే ధ్యేయంగా దందా
- కాలం చెల్లిన మందుల విక్రయాలు
- అమాయకుల ప్రాణాలతో చెలగాటం
- నామమాత్ర తనిఖీలకే అధికారులు పరిమితం



జిల్లాకేంద్రంలోని ఓ మెడికల్ షాపులో తనిఖీ చేస్తున్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్ శ్రీలత (ఫైల్)

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో మెడికల్ షాపుల దందా జోరుగా సాగుతోంది. భారీగా లాభాలు ఉండడంతో పలువురు నిబంధనలకు తిలోదకాలిస్తున్నారు. లైసెన్సు ఒకరి పేరిట ఉండగా, మరొకరు నిర్వహణ కొనసాగిస్తున్నవి జిల్లాలో అనేకం ఉన్నాయి. చాలా చోట్ల అంతంత మాత్రంగా చదువుకున్న వారే ఫార్మసిస్టులుగా వ్యవహరిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 400 మందుల షాపులు ఉన్నాయి. చాలా వాటిలో నాసిరకం మందుల విక్రయాలు జోరుగా సాగుతున్నట్లు ప్రచారం సాగుతోంది. ఆర్‌ఎంపీలు, ఇతర ఆసుపత్రులతో సంబంధాలు కొనసాగిస్తున్నారు. వారు రాసే నాసిరకం మందులను అంటగడుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. పలు కంపెనీలు నాసిరకం మందులు తయారు చేస్తూ మెడికల్ షాపుల నిర్వాహకులకు 30నుంచి 70 శాతం వరకు డిస్కౌంట్‌తో ప్రలోభాలకు గురిచేస్తున్నారు. మెడికల్ రిప్‌లు ఆస్పత్రులను సందర్శించి వైద్యులతో మాట్లాడి ఆర్డర్ తీసుకుంటున్నారు. ఒప్పందం కుదుర్చుకొని వారికి పెద్ద మొత్తంలో కమీషన్లను ఆఫర్ చేస్తున్నారు. ఈ ప్రభావం ప్రజల ఆరోగ్యంపై పడుతోంది. ఈ దందాను నివారించాల్సిన సంబంధిత అధికారులు ప్రేక్షక పాత్ర పోషించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అనర్హులతో నిర్వహణ..

జిల్లాలో పలు మెడికల్ షాపుల అనుమతి ఒకరి పేరిట ఉంటే, మరొకరు నిర్వహించడం పరిపాటిగా మారింది. ఫార్మసిస్టు సర్టిఫికెట్లు అద్దెకు తీసుకొని వారికి నెలనెలా డబ్బులు చెల్లిస్తున్నారు. నిర్వాహకులకు అవగాహన లేనప్పటికీ ప్రజలకు మందులను అందజేస్తున్నారు. ఆర్‌ఎంపీలు నిర్వహిస్తున్న క్లినిక్‌లకు అనుసంధానంగా కూడా షాపులు ఏర్పాటు చేసుకోవడం గమనార్హం. మిగతా ఆసుపత్రుల్లో సంబంధిత వైద్యులే షాపుల నిర్వహణ కొనసాగిస్తున్నారు. మరికొన్ని మెడికల్ షాపులు ఆస్పత్రి నిర్వహణకు సంబంధించి వారే చూసుకుంటున్నారు. 60 శాతం వైద్యుడికి కమీషన్ ఇచ్చి 40 శాతం నిర్వాహకులు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. దీన్నిబట్టి చూస్తే మెడికల్ మాఫియా ఏవిధంగా ఉందో అర్థమవుతోంది.

జెనరిక్ అందుబాటులో ఉన్నా..

నిరుపేద కుటుంబాలు ఖరీదైన మందులు కొనుగోలు చేయని పరిస్థితుల్లో జెనరిక్ మందులను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. రోగులు అవే మందులు వాడేలా వైద్యులు ప్రోత్సహించాలని అధికారులకు ఆదేశాలు కూడా జారీ చేసింది. అయితే వాటిపై మెడికల్ షాపుల నిర్వాహకులు అసత్య ప్రచారాలు చేస్తూ పబ్బం గడుపుకుంటున్నట్లు తెలుస్తోంది. దీనిపై సంబంధిత అధికారులు 'మామూలు'గా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని జిల్లావాసులు కోరుతున్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

నిబంధనలు అతిక్రమించే మెడికల్ షాపుల యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఫార్మసిస్టు సర్టిఫికెట్ ఉన్నవారు మాత్రమే మందుల విక్రయాలు చేపట్టాలి. ఒకరికి బదులు ఒకరు విక్రయించినా నోటీసులు జారీ చేసి షాపును మూసివేయిస్తాం. తరచూ తనిఖీలు చేపడుతున్నాం. రెండు రోజుల క్రితం కాలం చెల్లిన మందులు విక్రయించినట్లు ఫిర్యాదు రాగా, సంబంధిత యజమానికి నోటీసులు జారీ చేశాం. వారి వివరణ అనంతరం శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.

– ఎ.శ్రీలత, డ్రగ్ ఇన్‌స్పెక్టర్, ఆదిలాబాద్

పల్లెలకు పాలనాధికారులు

- ఇప్పటికే పోస్టింగ్ ఉత్తర్వులు
- త్వరలోనే జీపీవోలుగా బాధ్యతలు
- గ్రామాల్లో మెరుగుపడనున్న రెవెన్యూ సేవలు
- భూ సమస్యల సత్వర పరిష్కారానికి అవకాశం



కలెక్టర్ రాజర్షిషాను శనివారం కలిసిన జీపీవోలు

కైలాస్‌నగర్: పల్లెలకు పాలనాధికారులు రాబోతున్నారు. భూభారతి చట్టం అమల్లో భాగంగా రెవెన్యూశాఖ వ్యవహారాలను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించేందు కోసం రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పాలనాధికారుల (జీపీవో) వ్యవస్థను అందుబాటులోకి తెచ్చిన విషయం విదితమే. ఈమేరకు వారు నిర్వహించాల్సిన విధులకు సంబంధించిన జాబ్‌చార్టును సైతం స్పష్టం చేసింది. ఈ నెల 5న హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా జిల్లాకు సంబంధించి 83 మంది జీపీవోలు నియామక ఉత్తర్వులు అందుకున్నారు. వీరికి కలెక్టర్ కౌన్సెలింగ్ నిర్వహించి త్వరలోనే క్లస్టర్ల వారీగా కేటాయించనున్నారు. వీఆర్వో, వీఆర్‌ఏ వ్యవస్థ రద్దుతో రెవెన్యూశాఖకు దూరమైన అధికారులు తిరిగి గ్రామాల్లో అందుబాటులోకి రానున్నారు. దీంతో భూ సమస్యలు త్వరితగతిన పరిష్కారమయ్యే అవకాశముందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

వారికి ఇన్‌చార్జి బాధ్యతలు

మిగతా 93 క్లస్టర్లకు సంబంధించి గతంలో రెవెన్యూశాఖలో పనిచేసి ప్రస్తుతం వివిధ శాఖల్లో జూనియర్ అసిస్టెంట్, రికార్డు అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న వారిని గుర్తించి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించనున్నట్లుగా ప్రభుత్వం భావిస్తోంది. ఈమేరకు అర్హులైన వారి వివరాలను మండలాల వారీగా రెవెన్యూ యంత్రాంగం ఇప్పటికే సేకరించి ప్రభుత్వానికి నివేదించింది. తదుపరి ఆదేశాలకు అనుగుణంగా చర్యలు చేపట్టనున్నట్లు తెలుస్తోంది.

భూభారతి అమల్లో కీలకపాత్ర

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న భూభారతి చట్టం కింద అందిన దరఖాస్తుల పరిష్కారంలో జీపీవోలు కీలకపాత్ర పోషించనున్నారు. గతంలో రెవెన్యూశాఖలో పనిచేసిన అనుభవం ఉండటంతో దరఖాస్తుల విచారణలో వీరు ప్రధాన పాత్ర పోషించనున్నారు. గ్రామాల్లో తలెత్తే భూ వివాదాలను స్థానికంగానే పరిష్కరించడంలో వీరి పాత్ర కీలకం కానుంది.

క్లస్టర్‌కు ఒక జీపీవో..

జిల్లాలో మొత్తం 508 రెవెన్యూ గ్రామాలున్నాయి. ఇందులో 2, 3 గ్రామాలను కలిపి గతంలోనే 183 రెవెన్యూ క్లస్టర్లను ఏర్పాటు చేశారు. తొలుత గ్రామానికో జీపీవో నియమించాలని రాష్ట్ర ప్రభుత్వం భావించింది. ఇందు కోసం పూర్వ వీఆర్‌వో, వీఆర్‌ఏల నుంచి ఆప్షన్లను స్వీకరించింది. అయితే చాలా మంది ఆసక్తి చూపలేదు. ఆప్షన్లు ఇచ్చిన వారికి పరీక్షలు నిర్వహించగా అందులోనూ చాలా మంది ఫెయిలయ్యారు. దీంతో సరిపడా అందుబాటులో లేకపోవడంతో క్లస్టర్‌కు ఒక జీపీవోను నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలో రెండు విడతల్లో నిర్వహించిన పరీక్షల్లో ఉత్తీర్ణులైన 83 మందికి ఇటీవల సీఎం చేతుల మీదుగా నియామక ఉత్తర్వులు అందజేశారు. సర్దుబాటులో భాగంగా నిర్మల్ జిల్లాలో 10 మంది అదనంగా ఉండగా వారిని ఆదిలాబాద్‌కు కేటాయించారు. వారిని పరిగణలోకి తీసుకుంటే మొత్తం 93 మంది అందుబాటులోకి రానున్నారు. వీరికి సొంత నియోజకవర్గం, పనిచేస్తున్న మండలంలో కాకుండా ఇతర మండలాల్లోని క్లస్టర్లలో పోస్టింగ్ కేటాయించనున్నారు. కలెక్టర్ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించి బాధ్యతలు అప్పగించనున్నారు. వీరిని మినహాయిస్తే జిల్లాలో మరో 90 క్లస్టర్లు ఖాళీగా ఉండనున్నాయి.

జీపీవోల బాధ్యతలివే..

- గ్రామ ఖాతాల నిర్వహణ
- వివిధ ధ్రువీకరణ పత్రాల జారీ కోసం క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించడం.
- ప్రభుత్వ భూములు, చెరువులు, నీటి వనరుల ఆక్రమణలకు సంబంధించి విచారణలతో పాటు వాటిని రక్షించేలా చూడటం.
- భూ సంబంధిత వివాదాలను అధికారులకు నివేదించడం, భూసర్వేలో సర్వేయర్లకు సహకరించడం
- విపత్తు నిర్వహణ విధులు నిర్వర్తించడం, అవసరమైన అత్యవసర సేవలు అందించడం
- ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలు, అభివృద్ధి ప్రాజెక్టులకు లబ్ధిదారులను గుర్తించడం
- ఎన్నికల సంబంధిత విధుల్లో సిబ్బందికి సాయం చేయడంతో పాటు గ్రామంలోని ప్రొటోకాల్ అధికారులకు సహకరించడం
- గ్రామం, క్లస్టర్, మండల స్థాయిలోని అధికారులను సమన్వయం చేసుకుని విధులు నిర్వర్తించడం.
- ప్రభుత్వం, భూ పరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్‌ఏ), జిల్లా కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్ వంటి అధికారులు అప్పగించిన పనులు నిర్వర్తించాల్సి ఉంటుంది.

పక్కాగా సాగు లెక్క

- డిజిటల్ క్రాప్ బుకింగ్ షురూ
- క్షేత్రస్థాయిలో నమోదు చేపట్టిన వ్యవసాయ శాఖ
- నెలాఖరులోపు పూర్తి చేసేలా కార్యాచరణ

జిల్లాలో..	
మండలాలు	: 20
మొత్తం రైతులు	: 1.65లక్షలు
క్లస్టర్లు	: 101
సాగుభూమి(ఎకరాల్లో)	: 5లక్షల 77వేలు



బోథ్ మండలం మర్లపెల్లిలో డిజిటల్ క్రాప్ బుకింగ్ ద్వారా వివరాలు నమోదు చేస్తున్న ఏఈవో

ఇచ్చోడ: జిల్లాలో రైతులు పండిస్తున్న పంటల సాగు లెక్క పక్కాగా చేపట్టేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. క్రాప్ బుకింగ్ కోసం వ్యవసాయ శాఖ కసరత్తు ప్రారంభించింది. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా ఏఈవోలకు మొబైల్ ఫోన్లలో యాప్‌ను ఇన్‌స్టాల్ చేసింది. క్షేత్రస్థాయిలో ఏఈవోలు పర్యటించి సర్వే నంబర్, రైతుల వారీగా ఫొటోలను చిత్రీకరించి పంటల వివరాలు నమోదు చేయాలి. ఈ నెలాఖరు వరకు సర్వే పూర్తి చేయాలని వ్యవసాయశాఖ ఆదేశాలు జారీ చేసింది. దీంతో జిల్లా వ్యాప్తంగా ఏఈవోలు డిజిటల్ క్రాప్ బుకింగ్ కోసం పొలం బాట పడుతున్నారు. క్లస్టర్ పరిధిలో ఒక్కో ఏఈవో 5 వేల ఎకరాల్లో వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది.

మూడు వేలు డిజిటల్.. రెండు వేలు ఆన్‌ఫోన్

ప్రతీ ఏఈవో క్లస్టర్ వారీగా క్షేత్రస్థాయిలో పర్యటించి డిజిటల్ క్రాప్ బుకింగ్ యాప్ ద్వారా మూడు వేల ఎకరాల్లో వివరాలు నమోదు చేయాలి. మరో రెండు వేల ఎకరాల వివరాలను రైతుల ద్వారా అడిగి ఆన్‌ఫోన్ ద్వారా వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. మారుమూల గ్రామాల్లో సాంకేతికత సమస్యల దృష్ట్యా ఆన్‌ఫోన్ నమోదుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది.

పంటల నమోదు షురూ

ఏఈవోలు క్షేత్రస్థాయిలో పర్యటించి పంటల వివరాలు నమోదు చేస్తున్నారు. సర్వేనంబర్లు, రైతుల వారీగా సాగు చేస్తున్న పంటల ఫొటోలు తీసి యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. రైతు ఎంత విస్తీర్ణంలో ఏ పంట సాగు చేస్తున్నాడో వంటి వివరాలను అందులో పొందుపరుస్తున్నారు.

పంట విక్రయాల్లో పారదర్శకత...

డిజిటల్ క్రాప్ బుకింగ్ ద్వారా పంటల విక్రయ సమయంలో పారదర్శకత ఏర్పడనుంది. పత్తి, సోయా, కంది, మొక్కజొన్న తదితర పంటలకు ప్రభుత్వరంగ సంస్థల ద్వారా రైతుకు మద్దతు ధర అందుతుంది.అయితే ప్రైవేట్‌తో పోల్చితే ఈ ధరలో వ్యత్యాసం ఉండడంతో కొనుగోళ్లలో గోల్‌మాల్‌కు అవకాశం ఉంటుంది. దళారులు పంట దిగుబడులను రైతుల నుంచి తక్కువ ధరకు విక్రయిస్తుంటారు. ఆ పంటలను కొంతమంది సాగు చేయని రైతుల పేరిట విక్రయించి భారీగా సొమ్ము చేసుకుంటున్నారు. డిజిటల్ క్రాప్ బుకింగ్ ద్వారా పంట ఏ మేరకు సాగవుతుందో రైతుల వారీగా పూర్తి వివరాలుంటాయి. తద్వారా అక్రమాలకు చెక్ పడనుంది. విక్రయాల్లో పారదర్శకత ఏర్పడనుంది.

గడువులోపు పూర్తి చేస్తాం

జిల్లాలో డిజిటల్ క్రాప్ బుకింగ్ ప్రక్రియను గడువులోపు పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నాం. ఏఈవోల మొబైల్ ఫోన్లలో ఇప్పటికే యాప్‌ను ఇన్‌స్టాల్ చేశాం. వారు క్షేత్రస్థాయిలో వివరాలు నమోదు చేస్తున్నారు.

– శ్రీధర్‌స్వామి, జిల్లా వ్యవసాయాధికారి

ప్రశాంతంగా గణేశ్ నిమజ్జనం

- పెన్‌గంగ వద్ద ఏర్పాట్లను పర్యవేక్షించిన కలెక్టర్, ఎస్పీ



పెన్‌గంగ వద్ద నిమజ్జనానికి తరలుతున్న గణనాథుడు

ఆదిలాబాద్‌టౌన్/సాత్నాల: జిల్లాలో గణేశ్ నిమజ్జనోత్సవం ప్రశాంతంగా ముగిసింది. పట్టణంలోని ఆయా వినాయక మండపాల నుంచి ప్రత్యేక రథాల్లో శనివారం ప్రారంభమైన గణనాథుల శోభాయాత్ర ఆదివారం వరకు కొనసాగింది. అర్ధరాత్రి తర్వాత నుంచి క్రమంగా భోరజ్ మండలంలోని పెన్‌గంగకు చేరువయ్యాయి. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన క్రేన్ల ద్వారా వినాయకులను నిమజ్జనం చేశారు. ఈ ప్రక్రియ సాయంత్రం వరకు కొనసాగింది. కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్ ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అన్ని శాఖలు సమన్వయంతో వ్యవహరించడంతో ప్రక్రియ సజావుగా ముగిసినట్లు తెలిపారు. 412 విగ్రహాల నిమజ్జనం అయినట్లు రెవెన్యూ అధికారులు వెల్లడించారు. ఆయన వెంట ట్రెయినీ కలెక్టర్ సలోని చాబ్రా, పోలీసు, రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

గట్టి బందోబస్తు..

ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు శాఖ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. కింది స్థాయి సిబ్బంది నుంచి ఎస్పీ వరకు తనిఖీలు చేపట్టారు. శాంతియుతంగా సాగేలా చర్యలు తీసుకున్నారు. క్లస్టర్లుగా ఏర్పాటు చేసి ఎస్సై, సీఐ స్థాయి అధికారులకు విధులను కేటాయించారు. అలాగే పెన్‌గంగ వద్ద ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ సింగ్, ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్ రెడ్డి దగ్గరుండి ప్రక్రియను పర్యవేక్షించారు. వీరితో పాటు రెవెన్యూ, వైద్య, ఫైర్, మున్సిపల్ తదితర శాఖల అధికారులు విధులు నిర్వర్తించారు. ఇదిలా ఉండగా శనివారం రాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు జరిగిన శోభయాత్రలను ఎస్పీ అఖిల్ మహాజన్ దగ్గరుండి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ 11 రోజుల పాటు పోలీసులు విధులు నిర్వహించి ప్రశాంత వాతావరణంలో వేడుకలు సాగేలా కృషి చేశారని తెలిపారు. గణేష్ మండపాల నిర్వాహకులు, హిందూ సంఘాల నాయకులకు అభినందనలు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఇలాంటి సంస్కృతి ఏటా కొనసాగాలని ఆకాంక్షించారు. పోలీసు సిబ్బంది సివిల్, రిజర్వు, హోంగార్డు సిబ్బంది, స్పెషల్ పార్టీ, క్యూఆర్టీ సిబ్బందిని అభినందించారు. 150 మంది ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు ఈ వేడుకల్లో పాల్గొని సేవలు అందించినట్లు తెలిపారు. ఆదిలాబాద్‌తో పాటు బోథ్, ఉట్నూర్, ఇచ్చోడలో ఎక్కడ కూడా ఎలాంటి సంఘటనలు జరగకుండా విజయవంతంగా వేడుకలు పూర్తయినట్లు చెప్పారు.



సిబ్బందికి సూచనలు ఇస్తున్న కలెక్టర్ రాజర్షి షా



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

మంత్రి 'అడ్లూరి'ని కలిసిన సుగుణ

ఉట్నూర్‌రూరల్: ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో పలు అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణ కోరారు. ఈమేరకు రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను జగిత్యాల జిల్లా ధర్మపురిలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆదివారం కలిసి వినతి పత్రం సమర్పించారు. మారుమూల గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. అలాగే ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న సీఆర్టీల వేతనాలు వెంటనే మంజూరు చేయాలని, భారీ వర్షాలతో నష్టపోయిన రహదారుల మరమ్మతులకు నిధుల మంజూరు చేయాలని, జైనూర్ ప్రభుత్వ ఆస్పత్రిని 40 పడకల ఆస్పత్రిగా తీర్చిదిద్దాలని మంత్రికి విన్నవించినట్లు తెలిపారు. ఈమేరకు మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఆమె పేర్కొన్నారు.

మంత్రిని కలిసిన టీపీటీఎఫ్ నాయకులు

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ టీపీటీఎఫ్ నాయకులు ఆదివారం మంత్రి లక్ష్మణ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఇందులో సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆత్రం భుజంగ్‌రావు, నాయకులు రమేశ్, రామచంద్రం, గోవర్ధన్, వెంకటేశ్వరరావు, జ్ఞానేశ్వర్, సుధాకర్ తదితరులున్నారు.



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న సుగుణ



సందె వేళ.. కనువిందు

సందె వేళలో నింగీనేల కలిసేలా ప్రకృతిలో ఆవిష్కృతమైన దృశ్యం కనువిందు చేసింది. ఓ వైపు కారుమబ్బులు.. మరో వైపు భానుడి అస్తమయాన రూపుదిద్దుకున్న సువర్ణ వర్ణం.. దిగువన పచ్చని మొక్కజొన్న చేనుతో ఆకట్టుకుంది. సిరికొండ మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం కనిపించిన దృశ్యాన్ని 'సాక్షి' కెమెరా క్లిక్ మనిపించింది. – సిరికొండ

గ్రహణం ఎఫెక్ట్.. ఆలయాలు మూసివేత

'గూడెం' వద్ద..



దండేపల్లి: సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు దండేపల్లి మండలంలోని గూడెం సత్యనారాయణస్వామి ప్రధాన ఆలయంతోపాటు, అనుబంధ ఆలయాలను మూసివేశారు. తిరిగి సోమవారం ఉదయం సంప్రోక్షణ అనంతరం భక్తుల దర్శనాలు ప్రారంభమవుతాయని ఆలయ ఈవో శ్రీనివాస్ పేర్కొన్నారు.



మూసివేసిన శ్రీ లక్ష్మీ నారాయణస్వామి ఆలయం

జైనథ్‌లో

జైనథ్: మండల కేంద్రంలో శ్రీ లక్ష్మీనారాయణస్వామి ఆలయానికి ఆదివారం ఉదయం 10:30 గంటలకు మూసివేశారు. తిరిగి సోమవారం ఉదయం 4:00 గంటలకు తెరవనున్నారు. గ్రహ సంప్రోక్షణ, అనంతరం స్వామివారికి హారతి కార్యక్రమం తర్వాత 6 గంటలకు భక్తులకు స్వామివారి దర్శనం ఉంటుందని ఈవో చంద్రశేఖర్ తెలిపారు.

మూసివేసిన కాల్వ శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయ ప్రధాన ద్వారం



దిలావర్‌పూర్‌లో..

దిలావర్‌పూర్: మండలంలోని ప్రధాన ఆలయాలను ఆదివారం మధ్యాహ్నం మూసివేశారు. స్థానిక ఏకనాథుని, రేణుక ఎల్లమ్మ, నవాంజనేయ, శ్రీమాతాన్నపూర్ణ పాపహరేశ్వర, కాల్వ పరిసర అటవీ ప్రాంతంలోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయాలను అర్చకులు మూసివేశారు. సోమవారం సంప్రోక్షణ అనంతరం భక్తులకు దర్శనం కలుగజేస్తామని ఆలయ వర్గాలు వెల్లడించాయి.

క్లుప్తంగా

అంబులెన్స్‌లో ప్రసవం



జన్మనిచ్చిన ఆడపిల్లతో తల్లి

ఇచ్చోడ: బజార్‌హత్నూర్ మండలం సోనేరావుగూడ గ్రామానికి చెందిన జయమాల అనే గర్భిణీ అంబులెన్స్‌లో ప్రసవించింది. ఆదివారం ఆమెకు పురిటినొప్పులు రావడంతో భర్త చరణ్‌దాస్ అంబులెన్స్ సిబ్బందికి సమాచారమిచ్చారు. వారు అక్కడికి చేరుకుని ఆమెను ఇచ్చోడ పీహెచ్‌సీకి తరలిస్తుండగా మార్గమధ్యలో నొప్పులు అధికమయ్యాయి. అంబులెన్స్‌ను రోడ్డు పక్కన నిలిపి ఈఎంటీ శశికాంత్ ఆమెకు ప్రసవం చేయగా ఆడపిల్లకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డను ఇచ్చోడ పీహెచ్‌సీకి తరలించారు. ఈఎంటీ శశికాంత్, పైలెట్ జైసింగ్‌లకు మహిళ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఎడ్యుకేషన్ లోన్ పేరిట మోసం

మందమర్రిరూరల్: ఎడ్యుకేషన్ లోన్ పేరిట యువకుడు మోసపోయిన ఘటన మందమర్రిలో చోటుచేసుకుంది. ఎస్సై రాజశేఖర్ కథనం ప్రకారం.. మూడవ జోన్‌కు చెందిన యువకుడు ఆన్‌లైన్‌లోని ఓ వెబ్‌సైట్‌లో రూ.50 వేల ఎడ్యుకేషన్ లోన్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. ఆ వెబ్‌సైట్ నుంచి లోన్ ఆమోదం అయిందని నమ్మించి అతని ఆధార్, పాన్‌కార్డు, వ్యక్తిగత వివరాలు, ఖర్చులకు రూ.37,500 చెల్లించాలని చెప్పారు. డబ్బులు చెల్లించిన తర్వాత లోన్ రాకపోయేసరికి మోసపోయానని గ్రహించాడు. వెంటనే సైబర్ క్రైం హెల్ప్‌లైన్ నంబర్ 1930కి ఫిర్యాదు చేయగా ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పాముకాటుకు యువరైతు మృతి



చిక్రం లింగు (ఫైల్)

నేరడిగొండ: అడవి పందుల బారి నుంచి పంట కాపాడుకునేందుకు కాపలా వెళ్లిన యువ రైతు పాముకాటుకు గురై మృతి చెందాడు. మండలంలోని గాజిలి గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన అనసూయ–వెంకట్ దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. గ్రామంలో పదెకరాల వ్యవసాయం చేసుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. రెండో కుమారుడు యువ రైతు చిక్రం లింగు (20) బుధవారం రాత్రి వారి పంట కాపలా కోసం అక్కడికి వెళ్లాడు. గురువారం ఉదయం ఇంటికి రాకపోయేసరికి కుటుంబీకులు వెళ్లి చూడగా లింగు అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. స్థానిక వైద్యుడికి చూపించగా, మెరుగైన వైద్యం కోసం 108లో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. శనివారం రాత్రి చికిత్స పొందుతూ మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

ఆదిలాబాద్‌లో గుర్తుతెలియని వ్యక్తి..



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని తిర్పెల్లి సమీపంలో గల రైల్వేస్టేషన్ ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు టూటౌన్ సీఐ నాగరాజు తెలిపారు. రైల్వే సిబ్బంది సమాచారం ఇవ్వడంతో ఆదివారం సంఘటన స్థలానికి చేరుకున్నట్లు పేర్కొన్నారు. మృతుడి వయస్సు 40 నుంచి 45 ఏళ్ల వరకు ఉంటుందని తెలిపారు. మృతదేహాన్ని రిమ్స్ ఆస్పత్రిలోని మార్చురీకి తరలించినట్లు చెప్పారు. ఎవరైన మృతదేహాన్ని గుర్తుపడితే టూటౌన్ పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

కొలిక్కి వచ్చినట్లేనా..

- చెన్నూర్ ఎస్బీఐ కేసులో పురోగతి
- 19 కిలోల బంగారు ఆభరణాలు రికవరీ?
- రెండురోజుల్లో పూర్తి రికవరీకి అవకాశం
- కోర్టు ద్వారా బ్యాంక్‌కు అప్పగించనున్న పోలీసులు



చెన్నూర్ ఎస్బీఐ

చెన్నూర్: చెన్నూర్ ఎస్బీఐ–2 బ్రాంచిలో కుంభకోణం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. 20 కిలోల బంగారు ఆభరణాలు, రూ.1.10 కోట్ల నగదు కోంభకోణ కేసును పక్షం రోజుల్లో రామగుండం సీపీ నేతృత్వంలో మంచిర్యాల డీసీపీ భాస్కర్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో చెన్నూర్ సీఐ దేవేందర్‌రావు 90 శాతం పురోగతి సాధించినట్లు తెలిసింది. పోలీసులు సుమారు 19 కిలోల బంగారు ఆభరణాలు రికవరీ చేసినట్లు తెలిసింది. ఈనెల 3 నుంచి 6 తేదీ వరకు గణేశ్ నిమజ్జనంలో పోలీసు అధికారులు బిజీబిజీగా ఉన్నారు. సోమవారం పనిదినాలు కావడంతో రెండు రోజుల్లో పూర్తిస్థాయిలో బంగారు అభరణాలు రికవరీ చేసే అవకాశం ఉందని సమాచారం.

రికవరీ బంగారం కోర్టు ద్వారానే..

పోలీసులు పూర్తిస్థాయిలో రికవరీ చేసిన బంగారు ఆభరణాలను కోర్టులో అప్పగిస్తారని తెలిసింది. బ్యాంక్ లీగల్ అడ్వయిజర్ బ్యాంక్‌లో మాయమైన ఆభరణాల వివరాలను కోర్టుకు అప్పగించి స్వాధీనం చేసుకుంటారని సమాచారం. ఇదంతా పక్షం రోజులు పడుతుందని తెలిసింది. కోర్టు ద్వారా బ్యాంక్ స్వాధీనం చేసుకున్న తర్వాత బాధితుల వారీగా నగలు పరిశీలించాల్సి ఉంటుంది. 20 కిలోల బంగారు ఆభరణాలు కావడంతో 402 మంది బాధితులకు సంబంధించినవి వేరు చేయాలంటే రెండు నెలలు పట్టే అవకాశం ఉందని బ్యాంక్ అధికారులు అంటున్నారు.

నేడు బ్యాంక్ ఎదుట ఆందోళన?

ఎస్బీఐలో గోల్డ్ రికవరీ అయిన తర్వాత ఆభరణాలు ఎప్పుడిస్తారనే అనుమానం బాధితులను వెంటాడుతుంది. పూర్తిస్థాయిలో అధికారులు తమకు ఎప్పుడిస్తారనే సమాచారం లేక సోమవారం బ్యాంక్ ఎదుట ఆందోళనకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. అధికారులు స్పష్టమైన హామీ ఇచ్చేవరకు ఆందోళన కొనసాగిస్తామని పలువురు బాధితులు చర్చించుకుంటున్నట్లు తెలిసింది.



దిగువకు వెళ్తున్న నీరు

కడెం ప్రాజెక్ట్ గేటు ఎత్తివేత

కడెం ప్రాజెక్ట్ గరిష్ట నీటిమట్టానికి చేరుకుంది. ఆదివారం ఉదయం ప్రాజెక్ట్‌కు 4402 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తుండడంతో ఒక వరద గేటు ఎత్తి 4,053 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. పూర్తిస్థాయి నీటిమట్టం 700 అడుగులు కాగా, ప్రస్తుతం 699.450 అడుగులుగా ఉంది. – కడెం



నిండుకుండలా 'ఎల్లంపల్లి'

ఎస్సారెస్పీ, కడెం ప్రాజెక్టులతోపాటు ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న భారీ వరదతో ఎల్లంపల్లి జలాశయం నిండుకుండలా మారింది. ఆదివారం ప్రాజెక్ట్ నీటిమట్టం 148 మీటర్ల క్రస్ట్ లెవెల్‌కు గాను 147.58 మీటర్లకు 148, 20.175 టీఎంసీలకు గాను 20.175 టీఎంసీలతో ఉంది. ఇన్‌ఫ్లో కింద 1,500 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా అవుట్ ఫ్లో కింద హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ పథకానికి 315 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. 2 గేట్లు తెరిచి 1,185 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదిలిపెడుతున్నారు. – మంచిర్యాలరూరల్(హాజీపూర్)

నిజాయితీ చాటుకున్న ఆటోడ్రైవర్

- 16 తులాల బంగారు ఆభరణాలు అప్పగింత

లక్ష్మణచాంద: పోగొట్టుకున్న ఆభరణాలు, నగదును బాధితురాలికి అప్పగించి ఆటోడ్రైవర్ నిజాయితీ చాటుకున్నాడు. వివరాలు ఇలా ఉన్నాయి..కడెం మండల కేంద్రానికి చెందిన కొంక సుజాత ఖానాపూర్‌లో ఆరోగ్యమిత్రగా విధులు నిర్వహిస్తోంది. ఆమె కుమార్తె వివాహానికి 16 తులాల బంగారు ఆభరణాలు నిర్మల్‌లో చేయించింది. శనివారం కుమారుడితో కలిసి బంగారు ఆభరణాలు తీసుకుని బైక్ పక్కన బ్యాగులో ఉంచి మధ్యాహ్నం కడెంకు బయల్దేరారు. ఈక్రమంలో బ్యాగు ఎక్కడో పడిపోయింది. ఈ విషయమై సోషల్ మీడియాలో పోస్టు చేశారు. లక్ష్మణచాంద మండలం రాచాపూర్‌కు చెందిన ఆటోడ్రైవర్ తక్కల సాయికుమార్ నిర్మల్ నుంచి లక్ష్మణచాంద వెళ్తున్నాడు. నిర్మల్‌రూరల్ మండలం కొండాపూర్ ఫ్లైఓవర్ సమీపంలో 61వ జాతీయ రహదారిపై బ్యాగు పడి ఉండడాన్ని గమనించి ఇంటికి తీసుకెళ్లాడు. సోషల్ మీడియాలో చూసిన సాయికుమార్ ఆదివారం బాధితురాలి వివరాలు తెలుసుకున్నాడు. రాచాపూర్‌లో 16 తులాల బంగారు ఆభరణాలు ఉన్న బ్యాగును ఆమెకు అందించారు. బ్యాగు అందించి నిజాయితీ చాటిన సాయికుమార్‌ను సుజాత కుటుంబ సభ్యులు, పలువురు అభినందించారు.



సుజాతకు బంగారు ఆభరణాలు అందిస్తున్న ఆటోడ్రైవర్ సాయికుమార్

పాపికొండలను తలపిస్తున్న 'కడెం'

- హైకోర్టు జడ్జి సృజన



బోటింగ్ చేస్తున్న సృజన, కుటుంబీకులు

కడెం: కడెం ప్రాజెక్ట్ అందాలు బాగున్నాయని, పాపికొండలను తలపిస్తుందని హైకోర్టు జడ్జి సృజన అన్నారు. శనివారం రాత్రి కుటుంబ సభ్యులతో కడెం వచ్చారు. బృందావన్ రిసార్ట్స్‌లో విడిది అనంతరం ఆదివారం ఉదయం కడెం ప్రాజెక్ట్‌ను సందర్శించారు. ఆయకట్టు, వరద గేట్లు, నీటిమట్టం తదితర వివరాలను తెలుసుకున్నారు. అనంతరం మిషన్ భగీరథ ఇంటెక్‌వెల్‌ను పరిశీలించారు. ప్రాజెక్ట్‌లో కుటుంబ సభ్యులతో కలిసి బోటింగ్ చేశారు. ఆమె వెంట జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీవాణి, ఆర్ఐ శారద, రెవెన్యూ, పోలీసు, ఇరిగేషన్ సిబ్బంది ఉన్నారు.

డ్రగ్స్ ముఠా వెనుక కాంగ్రెస్ హస్తం

- బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

కాగజ్‌నగర్‌రూరల్: డ్రగ్స్ ముఠా వెనుక కాంగ్రెస్ నాయకుల హస్తం ఉండటంతోనే చూసీచూడనట్లు వదిలేస్తున్నారని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. హైదరాబాద్‌లోని చర్లపల్లిలో రూ.12వేల కోట్ల విలువైన డ్రగ్స్ ఓ కంపెనీలో పట్టుబడటం దారుణమని, దీనికి బాధ్యత వహిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కాగజ్‌నగర్ మండలం కోసినిలోని ఆయన నివాసంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మహారాష్ట్ర పోలీసులు నెల రోజుల పాటు కాపుకాసి అన్ని ఆధారాలతో దాడులు చేసి డ్రగ్స్ పట్టుకున్నారని, తెలంగాణ పోలీస్ వ్యవస్థ పూర్తిగా విఫలమైందన్నారు. డ్రగ్స్ మొక్క ఎక్కడ ఉన్నా గద్దలా పీకేస్తామని, దీని కోసం ఈగల్ అనే ఈ కొత్త డిపార్ట్‌మెంట్ ప్రారంభిస్తామని చెప్పిన సీఎం చర్లపల్లిలో డ్రగ్స్ ఎందుకు పట్టుకోలేదని ప్రశ్నించారు.

ఎస్పీ ఎం కార్మిక సంఘాల ఎన్నికలు నిర్వహించాలి

సిర్పూర్ పేపరుమిల్లులో కార్మిక సంఘాల ఎన్నికలు నిర్వహించాలని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఇటీవల మిల్లు ప్రమాదంలో ఎన్నం భాస్కర్ అనే కాంట్రాక్టు కార్మికుడు గాయపడిన ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలన్నారు. మిల్లు నుంచి వచ్చే విషవాయువులతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. సమావేశంలో నాయకులు శ్యాంరావు, కొంగ సత్యనారాయణ, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావుపై ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న హిందుత్వ వాదులు, ఛత్రపతి శివాజీ అభిమానులు, కాంగ్రెస్ నేతలు

మంచిర్యాలటౌన్: మంచిర్యాలలో శనివారం వినాయక నిమజ్జనం కార్యక్రమంలో భాగంగా మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్ రావుపై అసత్య ఆరోపణలు చేసిన మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావుపై చర్యలు తీసుకోవాలని హిందుత్వవాదులు, ఛత్రపతి శివాజీ అభిమానులు, కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసిన అనంతరం మాట్లాడారు. గణేశ్ నిమజ్జనాన్ని హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించగా, వేదికపైకి వచ్చిన మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు అసత్యపు మాటలతో రాజకీయ వేదికగా మార్చి, విద్వేషాలతో ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నం చేశారన్నారు. మాజీ ఎమ్మెల్యేతోపాటు అనుచరులపై మంచిర్యాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

బాల్‌బ్యాడ్మింటన్ ఉమ్మడి జిల్లా జట్టు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో అసోసియేషన్ నాయకులు

రెబ్బెన: రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు అద్భుతమైన ఆటతీరును ప్రదర్శించి జిల్లాకు మరింత పేరు తీసుకురావాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గుల్బం చక్రపాణి అన్నారు. గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి ఉన్నత పాఠశాల మైదానంలో ఆదివారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అండర్–14 బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించారు. పోటీలకు సుమారు 30 మంది బాలికలు, 20 మంది బాలుర హాజరయ్యారు. అనంతరం క్రీడాకారులకు పోటీలు నిర్వహించి జిల్లా జట్లను ఎంపిక చేశారు. ఈనెల 13 నుంచి 14 వరకు జనగామ జిల్లా కూనురులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వారు పాల్గొంటారని బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎస్.తిరుపతి తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోటు శ్రీధర్‌రెడ్డి, సీనియర్ క్రీడాకారులు నరేశ్ పాల్గొన్నారు.

ఎంపికైన క్రీడాకారులు

ఉమ్మడి జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ బాలిక జట్టుకు ఎం.సహాస్ర, టి.ప్రజ్వలశ్రీ, పి.శ్రావ్య,ఎస్.సాయిశ్రీ వర్షిణి, డి.వేరోనికా, జి.హన్నా, పి.సిరి, బి.రాజేశ్వరి, పి.పవిత్ర, ఎండీ అల్వీన, ఎస్.రిషిత, డి.నందిని, ఎస్.విజయస్ఫూర్తి, ఎండీ జేబా, బాలుర జట్టుకు వరుణ్, నిఖిల్, ఎం.కృష్ణ లోకనందు, సీహెచ్ అఖిల్, బి.రాఘవ, బి.ఆంజనేయులు, కె.స్టీఫెన్, జె.అశ్విన్, ఎం.తిరుపతి, సీహెచ్ అరవింద్, డి.విష్ణువర్ధన్, ఎం.త్రిచూర్ కృష్ణ ఎంపికయ్యారు.

ఎస్జీఎఫ్ క్రీడలు విజయవంతం చేయండి



మాట్లాడుతున్న ఆడే రామేశ్వర్

ఇచ్చోడ: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా త్వరలో నిర్వహించే ఎస్జీఎఫ్ క్రీడలను విజయవంతం చేయాలని ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి ఆడే రామేశ్వర్ కోరారు. మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో క్రీడాజట్ల ఎంపిక పోటీల నిర్వహణపై చర్చించారు. 43 క్రీడాంశాల్లో 14, 17 ఏళ్ల విభాగం బాలుర, బాలికల జోనల్ వేదికలు ఖరారు చేసినట్లు తెలిపారు. జట్ల ఎంపికను పారదర్శకంగా నిర్వహిస్తామన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారులు, వ్యాయామ ఉపాధ్యాయ, క్రీడా సంఘాలు, పీడీ, పీఈటీలు, సహకారంతో పోటీలు విజయవంతం చేయాలని తీర్మానించినట్లు తెలిపారు. సమావేశంలో మంచిర్యాల, నిర్మల్, ఆసిఫాబాద్ జిల్లాల ఎస్జీఎఫ్ కార్యదర్శులు ఎండీ యాకుబ్, రవీందర్‌గౌడ్, వెంకటేశ్, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లా వ్యాయమ విద్యా ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె,పార్థసారథి, బుక్యా రమేశ్, కె.భోజన్న, సాయికుమార్, మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

మూడు ఆలయాల్లో చోరీ



అగ్గిమల్లన్న ఆలయంలో హుండీని పగులగొట్టిన దొంగలు

ఖానాపూర్: పట్టణంలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంతోపాటు తర్లపాడ్‌లోని ఓంకారేశ్వర, అగ్గిమల్లన్న ఆలయాల్లో శనివారం రాత్రి చోరీ జరిగింది. వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో 6 సీసీ కెమెరాలు, డీవీఆర్, 4 గ్రాముల పుస్తెలు, ఓంకారేశ్వర ఆలయంలో సీసీ కెమెరాతో పాటు హుండీలో నగదు, కానుకలు, అగ్గిమల్లన్న ఆలయంలో హుండీని పగులగొట్టి నగదు, కానుకలను దొంగలు ఎత్తుకెళ్లారు. పట్టణంలోని శివాజీనగర్ కాలనీకి చెందిన సూదం శ్రీనివాస్ బైక్‌ను దొంగిలించారు. ఆలయకమిటీ సభ్యుల ఫిర్యాదులపై కేసులు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపారు.

సెపక్‌తక్రా ఉమ్మడి జిల్లా క్రీడాకారుల ఎంపిక



ఎంపికైన క్రీడాకారులు

రెబ్బెన: మండలంలోని గోలేటి టౌన్‌షిప్‌లో సింగరేణి ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో ఆదివారం సెపక్‌తక్రా ఉమ్మడి జిల్లా సీనియర్ క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనబర్చి ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపికైనవారు ఈనెల 20 నుంచి 22 వరకు మహబూబ్‌నగర్ జిల్లా వనపర్తిలో పాలిటెక్నిక్ కళాశాలలో జరగబోయే అంతర్ జిల్లాల పోటీల్లో పాల్గొంటారని అసోషియేషన్ ఉమ్మడి జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కుమ్మరి మల్లేశ్ తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోటు శ్రీధర్‌రెడ్డి, క్రీడాకారులు నరేశ్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపికైన క్రీడాకారులు..

సెపక్‌తక్రా ఉమ్మడి జిల్లా సీనియర్ పురుషుల జట్టుకు ఆడే రాజేందర్, ఆర్.వెంకటేశ్, చందు, రాజశేఖర్, రాందాస్, మహిళల జట్టుకు టి.అనూష, కె.స్ఫూర్తి కారుణ్య, జె.నేహశ్రీ, అభినవ రమ్య, కె.శ్రీవల్లి ఎంపికయ్యారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులను అసోషియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, ఒలింపిక్ అసోషియేషన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్.నారాయణరెడ్డి, సెపక్‌తక్రా అసోషియేషన్ సంయుక్త కార్యదర్శి శిరీష, ఎగ్జిక్యూటివ్ మెంబర్ కె.భాస్కర్, ఆర్.రామకృష్ణ, జి.శ్రీధర్, పి.సాంబయ్య అభినందించారు.

క్షుద్రపూజల కలకలం

కెరమెరి: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో క్షుద్రపూజల కలకలం రేపింది. గత కొంతకాలంగా పలు ప్రాంతాల్లో కుంకుమ, అగర్‌వత్తులు, నిమ్మకాయలతో పూజలు చేసినట్లు ఆనవాళ్లు కనిపించాయి. తాజాగా శనివారం రాత్రి ఓ ఇంటి ఎదుట నిమ్మకాయ, గుడ్డు ఉండడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఎవరికి హానీ చేయాలని ఇలా చేస్తున్నారు? లేదా గుప్తనిధుల కోసం ఇలా చేస్తున్నారో తెలియడం లేదని అంటున్నారు.

ఎదురెదురుగా ఢీకొన్న రెండు కార్లు

ముధోల్: మండలంలోని తరోడా గ్రామం వద్ద ఎదురెదురుగా రెండు కార్లు ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై బిట్లాపెర్సిస్ కథనం ప్రకారం.. నిజామాబాద్ జిల్లా రెంజల్ మండలం నీల గ్రామానికి చెందిన బలరాం, వర్ని మండలానికి చెందిన అనసూయ ఆదివారం భైంసా నుంచి నిజామాబాద్‌కు కారులో వెళ్తున్నారు. నిజామాబాద్ నుంచి భైంసాకు నవ్యశ్రీ, అనురాధ కారులో వస్తుండగా ఎదురెదురుగా ఢీకొన్నాయి. బలరాం, అనుసూయలకు తీవ్రగాయలై ఇద్దరి కాళ్లు విరిగాయి. నవ్యశ్రీ, అనురాధలకు స్వల్పగాయాలయ్యాయి. ఘటన స్థలానికి ఎస్సై చేరుకుని క్షతగాత్రులను భైంసా ఏరియాస్పత్రికి తరలించారు.